క్లుప్తంగా

ఎన్నిక



నియామకపత్రాన్ని అందజేస్తున్న శ్రీకాంత్ యాదవ్

మోతీనగర్: తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూకట్‌పల్లికి చెందిన న్యాయ విద్యార్థి మున్నాను శుక్రవారం ఎన్నుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో టీఎస్‌యూ ఫౌండర్ మెంబర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఎస్ఎం శ్రీకాంత్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని మున్నా అందుకున్నారు.

అసభ్యంగా ప్రవర్తిస్తే ఫిర్యాదు చేయండి

కుత్బుల్లాపూర్: మహిళలు, బాలికలపై పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిల ఆటకట్టించేందుకు షీటీమ్ బృందాలు అందుబాటులో ఉన్నాయి. మీ ప్రాంతంలో మహిళల పట్ల ఎవరైనా వెకిలిగా ప్రవర్తిస్తున్నా.. వేధింపులకు గురి చేస్తున్నా సైబరాబాద్ షీటీమ్ వాట్సప్ నంబరు (9490617444) లేదా పేట్ బషీరాబాద్ డివిజన్ షీటీమ్ నంబరు (7901114137) / 100 నంబర్లకు ఫోన్ చేయండి.

నేడు కెన్నడీ స్కూల్ వార్షికోత్సవం

నిజాంపేట్: బాచుపల్లిలోని కెన్నడీ హై ది గ్లోబల్ స్కూల్‌లో ఈనెల 10వ తేదీన 18వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల చైర్మన్ ఎస్‌జేరెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫౌండర్, ది నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బోర్డు ఆఫ్ శాంతా బయోటెక్నిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డాక్టర్ కె. వరప్రసాద్‌రెడ్డి, గౌరవ అతిథులుగా కెన్నడీ స్కూల్ ఎండీ ఎం.సుబ్బారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ బి.సుధాకర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.జైపాల్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

16 నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్ భండారి లేఅవుట్‌లోని శ్రీదక్షిణ ముఖ అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 14, 2023 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది. ఈనెల 16న ధనుర్మాస ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉదయం 10.30 గంటలకు తిరుప్పావై సేవా కాలం ఉంటుందన్నారు. అదే విధంగా 17 నుంచి జనవరి 14, 2023 వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు తిరుప్పావై, సేవాకాలం, గోష్టి, తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. జనవరి 14న భోగి పండుగను పురస్కరించుకుని ఉదయం 9.30 గంటలకు శ్రీగోదారంగనాథస్వామి, అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 2023 జనవరి 2వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 4 గంటలకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

సుపరిపాలనే లక్ష్యంగా ముందుకు..

కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: మున్సిపల్ ప్రజలకు సుపరిపాలన అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. శుక్రవారం కొంపల్లి మున్సిపల్ 4వ వార్డు పరిధిలోని సాయికృపా అపార్ట్‌మెంట్స్ వద్ద కొనసాగుతున్న తాగునీటి పైపులైన్ పనులను ఆయన కమిషనర్ శ్రీహరితో కలిసి పరిశీలించారు. అనంతరం కొంపల్లిలోని డీఆర్‌సీసీ సెంటర్‌ను ఐటీసీ సంస్థ ప్రతినిధి ఉమాకాంత్‌తో సందర్శించి పునరుద్ధరించే విషయమై చర్చించడంతో పాటు తడి, పొడి చెత్త వేరే చేసే ప్రక్రియను పరిశీలించారు. అదే విధంగా శ్మశానవాటికలో నెలకొన్న నీటి సమస్యపై ఫిర్యాదు అందుకున్న చైర్మన్ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. డీఈఈ చిరంజీవులు, మున్సిపల్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దుండిగల్: సీఎం సహాయ నిధి పథకంతో పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందుతున్నాయని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బాచుపల్లికి చెందిన హరినాథ్‌రెడ్డికి మంజూరైన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం శంభీపూర్ రాజు తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిట్ల దివాకర్, కోఆప్షన్ సభ్యుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో..



ప్రభాకర్‌రెడ్డి నగర్‌లో కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదాలకు నిలయంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- చేతికందే ఎత్తులో ఫ్యూజ్ బాక్స్‌లు
- పట్టపగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు



మిట్ట మధ్యాహ్నం వెలుగుతున్న లైట్లు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల సమస్యలు అధికంగా ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచే లేకపోవడం, వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు మధ్యలో అవసరం లేని చోటు విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటిని తొలగించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

- భరత్‌నగర్ కాలనీలోని రాయలసీమ గ్రౌండ్‌లో ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉంది.
- మూసాపేట చౌరస్తాలో యూనియన్ బ్యాంక్ సమీపంలో రోడ్డుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ తొలగించిన అధికారులు దిమ్మను తొలగించడం లేదు.
- భరత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల వెనుకభాగంలో రోడ్డు మలుపు వద్ద ఫ్యూజ్ బాక్స్ చిన్నారులకు సైతం అందే ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.
- ప్రభాకర్‌రెడ్డి నగర్ కాలనీ ప్రారంభంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి.
- జింకలవాడ కమ్యూనిటీ హాల్ సమీపంలో విద్యుత్ దీపాలు పట్టపగలే వెలుగుతూనే ఉన్నాయి. ఇదే కాలనీలో పలు చోట్ల రాత్రి సమయాల్లో విద్యుత్ లైట్లు వెలగడం లేదు.



చేతికందే ఎత్తులో చెట్టుకు ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్స్

'సమస్యల సాక్షిగా'కు.. ఫిర్యాదుల వెల్లువ..

మ్యాన్‌హోల్ మూత మార్చండి సారూ!





మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ జనప్రియనగర్‌లో ఇళ్ల మధ్యనున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసం కావడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జనప్రియనగర్ నుంచి హైటెక్ సిటీకి మార్గమధ్య దారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాక మ్యాన్‌హోల్ నుంచి దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూతను మార్చి కొత్తది ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– సోమేశ్వరరావు, జనప్రియనగర్

గమనిక: మీ ప్రాంతంలోని సమస్యలపై వాట్సాప్ ద్వారా సాక్షి బృందాన్ని సంప్రదించాల్సిన నంబర్. **9908362320**

బాధితుడి ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ స్పందన

విద్యుదాఘాతంతో చేతులు కోల్పోయిన వ్యక్తికి 'డబుల్' ఇల్లు కేటాయింపు



గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్: హైదరాబాద్‌లో నివాసముంటున్న పొట్లూరి సత్యనారాయణ వృత్తిరీత్యా వెల్డింగ్ పని చేస్తుంటాడు. గత మే నెలలో ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి రెండు చేతులు కోల్పోయాడు. కుటుంబానికి తానే ఆధారమని తనకు నాలుగేళ్ల పాప ఉందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా విన్నవించగా స్పందించిన మంత్రి కేటీఆర్ వారికి డబుల్ బెడ్రూమ్ ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు తెలిపారు. బాలానగర్‌లోని చిత్తారమ్మ బస్తీలో వారికి డబుల్ బెడ్రూమ్ కేటాయించి శుక్రవారం వారితో గృహప్రవేశం చేయించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కుత్బుల్లాపూర్: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్‌లోని క్యాంపు కార్యాలయంలో రూ.27,36,000 విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 20 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది మంది ప్రజలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజాసేవే లక్ష్యం: ఎమ్మెల్యే



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజలు ఇచ్చిన ఈ రాజకీయ జీవితంతోనే వారి కుటుంబ సభ్యునిగా సేవ చేసి తరిస్తూ నిరంతరం ప్రజల అభివృద్ధి కోసమే శ్రమిస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో రూ. 80 లక్షల వ్యయంతో టీచర్స్ కాలనీ, మల్లికార్జుననగర్, హరిజన బస్తీలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులు శుక్రవారం ఆయన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గతంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతుండే వారని గుర్తు చేశారు. మంచినీరు, విద్యుత్, పార్కులు, సీసీ, బీటీ రోడ్లు, జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు, శ్మశాన వాటికల అభివృద్ధి ఇలా ఎన్నో పనులు చేడుతున్నారన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయలను కల్పించిన ఘనత తమదేనని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని గ్రేటర్ హైదరాబాద్‌కు ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ప్రజలు సైతం సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మక్కాల నర్సింగ్ రావు, కర్రె లావణ్య, నాయకులు సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, మేకల హరినాథ్, మట్టి శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న పగుడాల శిరీష

మూసాపేట: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ పగుడాల శిరీష పేర్కొన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని బాలానగర్ నగర్ హౌసింగ్ బోర్డు కాలనీలో షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్, యోగాస్పేస్, చిల్డ్రన్ ఎక్విప్‌మెంట్ ఏరియా పనులతో పాటు కైత్లాపూర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళలకు ప్రాధాన్యమిస్తూ వారి కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృషి ఫలితంగా పార్కుల్లో పచ్చదనం కళకళలాడుతూ పూర్వవైభవం సంతరించుకుందని, చేపట్టిన నిర్మాణ పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్, శారద, శ్రీశైలం ఉన్నారు.

రేపు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 40 ఏళ్ల వేడుకలు

సనత్‌నగర్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఈనెల 11న బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ మారోజు రామాచారి ఓ ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ-మై లైఫ్' అనే అంశంపై తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదం



నమూనాలను పరిశీలిస్తున్న థామస్

బాలానగర్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్స్ ఎంతగానో దోహదపడతాయని ఎస్ఎస్‌కేకే స్కూల్స్ చైర్మన్ ఎస్.ఎం. థామస్ అన్నారు. శుక్రవారం బాలానగర్‌లోని స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి విద్యార్థులలో సృజనాత్మకత సైన్స్ ఫెయిర్‌లో వివిధ రూపాలలో కనిపిస్తోందన్నారు. విద్యార్థులను చదువుతోనే కాకుండా సాహిత్య, సామాజిక, సంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.పి. థామస్, విష్ణు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఓటర్ల నమోదు కార్యక్రమంపై ఈఆర్‌ఓలు రవికుమార్, రవీందర్‌కుమార్, వెంకట్‌గిరిల ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచురించిన ముసాయిదా రోల్‌లో రాజకీయ పార్టీల అభ్యంతరాలపై స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. నకిలీ ఓటర్లు ఉంటే ఓట్ల ఆజాబితాతో పాటు బూత్‌స్థాయి ఏజెంట్ల జాబితాను కూడా సమర్పించాలని ప్రతినిధులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు బాబురావు, శ్రవణ్, రాఘవేంద్ర, శ్రీకర్ హాజరయ్యారు.

మాలధారులతో కోలాహలంగా అయ్యప్ప దేవాలయం



ఇరుముడులు ధరిస్తున్న అయ్యప్ప స్వాములు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప భక్తులతో కోలాహలంగా మారింది. అనేక మంది అయ్యప్ప మాల ధరించి శబరిమలకు వెళ్లడానికి సిద్ధమవటంతో వారంతా కుటుంబ సభ్యుల సమక్షంలో ఇరుముడులను కట్టించుకొని బయలుదేరి వెళ్తున్నారు. అదేవిధంగా దేవాలయంలో భిక్ష కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్పలకు ఈ దేవాలయంలో అన్ని సౌకర్యాలు ఉండటంతో అనేక మంది ఇక్కడే మాలధారణ వేయించుకుంటున్నారు.



భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్పలు

మోతీనగర్: నియమ నిష్ఠ, భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్ష చేపడితే కోరిన కోరికలు నెరవేరుతాయని అయ్యప్ప స్వాముల ప్రగాఢ విశ్వాసమని నాగరాజు కన్నె స్వామి పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ జనప్రియనగర్‌లో నాగరాజు, సూర్య ప్రకాష్, సురేష్, ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహా పడిపూజలో పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వాములు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ఏదైనా సాధించవచ్చని అయ్యప్ప మాలధారణతో నిరూపితమైందన్నారు. అనంతరం స్వాములు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోణంకి జగన్నాథం, కొండం శ్రీనివాసరెడ్డి, ఎన్. శ్యాంసుందర్ రెడ్డి, ఆదిరెడ్డి మురళి పాల్గొన్నారు.

గోతులు తీసిన స్థలాల ఆక్రమణ

ఫిర్యాదు చేసిన రాజీవ్ గృహకల్పవాసులు

కుత్బుల్లాపూర్: సూరారం రాజీవ్‌గృహకల్పలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు, నీటి పైపులను ధ్వంసం చేసి గోతులు తీసి సదరు స్థలాలను ఆక్రమిస్తున్న విషయమై గృహకల్పవాసులు శుక్రవారం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ మంగతాయారుకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై టీఆర్ఎస్ నేత కె.ఎం.ప్రతాప్ సైతం ఉప కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. దీనిపై స్పందించిన డీసీ వెంటనే జీహెచ్ఎంసీ సిబ్బందిని గృహకల్పకు పంపించి తీసిన గోతులను పూడ్చివేయించారు. దీంతో గృహకల్ప వాసులు ప్రతాప్‌కు, ఉప కమిషనర్ మంగతాయారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్‌లో ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధుడిని గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ 4వ ఫేజ్‌లో ఉండే రామయ్య (62) గురువారం సాయంత్రం అదే ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారులు ఢీకొట్టి ఆపకుండా పారిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మెట్రో పనుల శంకుస్థాపనకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వెళ్తున్న నాయకులు



ఆల్విన్‌కాలనీ నుంచి..

కూకట్‌పల్లి: రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు నిర్మించే మెట్రో కారిడర్ రెండో దశ పనుల శంకుస్థాపన, భారీ బహిరంగ సభకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాయదుర్గం దగ్గర పూజలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీస్ అకాడమీ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోయినా హైదరాబాద్‌లో మెట్రోను విస్తరింపజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు



విద్యార్థులకు పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేసిన డా.సత్యం శ్రీరంగం



గొట్టిముక్కల వెంగళరావు ఆధ్వర్యంలో..



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: సోనియాగాంధీ దయతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లో సోనియ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పేన్సిళ్లు, పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించి ఆమె పుట్టిన రోజున రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన తెలంగాణ దేవత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, కృష్ణ, రాజపుత్, జహంగీర్, కృష్ణ చైతన్య, తులసి, ప్రత్యూష, శారద, భాషా పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావు ఆధ్వర్యంలో శుక్రవారం సోనియగాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, గురుమూర్తి, గణేష్, నరేందర్, కరీం, మురళీ, విజయ్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట: మూసాపేటలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు చున్నూ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు టి.సంతోష్, రఘు, శ్రీను, మల్లేష్, సచిన్, నహీం పాల్గొన్నారు.

మోతీనగర్: సోనియాగాంధీ రుణం తీర్చుకోలేనిదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లపు వేణు పేర్కొన్నారు. శుక్రవారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియగాంధీ త్యాగం వల్లనే నేడు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను ఆమె నెరవేర్చారన్నారు.

క్లుప్తంగా

మ్యాన్‌హోళ్లపై అధికారులకు సమాచారం ఇవ్వాలి

కూకట్‌పల్లి: ప్రమాదాలకు కారణమవుతున్న మాన్‌హోల్ కవర్లు తెరిచి ఉంచినట్లు గుర్తిస్తే జోనల్ కమిషనర్ కార్యాలయానికి లేదా సంబంధిత సర్కిల్ అధికారులకు సమాచారం అందించాలని తద్వారా ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించవచ్చునని జోనల్ కమిషనర్ వి. మమత అన్నారు. మూసాపేట డీసీ రమేష్ 7702304863, ఈఈ సత్యనారాయణ 9989930362, కూకట్‌పల్లి డీసీ కృష్ణయ్య 7337557245, ఈఈ గోవర్ధన్ గౌడ్ 9154299633, గాజుల రామారం డిసి మల్లారెడ్డి 6309529286, ఈఈ గోవర్ధన్ గౌడ్ 9154299633, కుత్బుల్లాపూర్ డిసి నాగమణి 7799910437, ఈఈ కృష్ణ చైతన్య 99701908887, అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి 8985409173, ఈఈ కె. రాజు 8978025473 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లోని శ్రీ ఓంకారేశ్వర శివాలయం , భక్త మార్కండేయ దేవాలయ ప్రథమ వార్షిక మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, శ్రీధర్‌రెడ్డి, విఠల్, అనంత రాములు, ఆంజనేయులు, సాంబశివుడు, సుదర్శన్, నర్సింహ, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడిగా నాగిరెడ్డి



నాగిరెడ్డి

మూసాపేట: భరత్‌నగర్ కాలనీకి చెందిన డాక్టర్ పి. నాగిరెడ్డి కూకట్‌పల్లి నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ టికెట్ కోసం డాక్టర్ కొరదాల నరేష్ దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న డాక్టర్ కొరదాల నరేష్

కూకట్‌పల్లి: బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ టికెట్ కోసం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కొరదాల నరేష్ దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ర్యాలీగా నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయానికి తరలి వెళ్లిన ఆయన రాష్ట్ర నాయకులకు దరఖాస్తు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి బీజేపీ ఎమ్మెల్యే టికెట్ పార్టీ తనకే కేటాయిస్తుందనే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎస్. హరికృష్ణ, నర్సింగ్‌రావు, కమలాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, బీసీ మోర్చా సీనియర్ నాయకులు దుర్గా ప్రసాద్, శంకర్, మహిళా మోర్చా నాయకురాలు లలిత రెడ్డి, జైశ్రీ, మమత, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత చీరలతో హుందాతనం



కార్యక్రమంలో పాల్గొన్న యాంకర్ సుమ

బంజారాహిల్స్: భారతీయ సంస్కృతిలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ యాంకర్ సుమ కనకాల అన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని జూబ్లీక్రాస్‌లో జీటీ వీవ్స్‌లో మనోహరి ఫెస్టివల్ కలెక్షన్స్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ... చేనేతకు ఎప్పుడూ వన్నె తగ్గలేదని నేటి తరం వారు ఎంతో ఇష్టంగా వాటిని ధరిస్తున్నారని అన్నారు. చేనేత అమ్మ చల్లని ఒడిని తలపిస్తుందన్నారు. చేనేత చీరలు మగువల హుందాతనాన్ని మరింత పెంచుతాయని అన్నారు. నిర్వాహకురాలు సౌజన్య పాల్గొన్నారు.

చెప్పిందే చేస్తాం.. చేసిందే చెబుతాం..

- గత పాలకుల నిర్లక్ష్యంతోనే అల్లాపూర్ డివిజన్ వెనుకబాటు
- బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



డా. బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



మోతీనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, చెప్పిందే చేస్తాం.. చేసిందే చెబుతామని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్‌లో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేపట్టారు. పద్మావతి నగర్, అజీజ్‌నగర్, మిరాజ్ నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పర్యటించిన ఆయన ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డివిజన్ అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో నేడు అభివృద్ధికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా తీర్చి దిద్దడమే తన లక్ష్యమన్నారు. సమస్య ఎక్కడుంటే తాను అక్కడ ఉంటానని తెలిపారు. నిత్యం ప్రజల కోసం తపించే ప్రజా ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ముందుకు సాగారు. కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ పాదయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించామని ప్రజలకు అవసరమైన మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులను పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్‌అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి, నాయకులు మహమ్మద్ జావెద్, కమల్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నీరాజనం పలుకుతున్నారు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లిలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు నీరాజనం పలుకున్నారన్నారు. 10 ఏళ్ల క్రితం వర్షం వస్తే చాలా ఇబ్బందులు పడేవారని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 90 శాతం సమస్యలు పరిష్కరించామన్నారు.

హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్స్ మేళాకు విశేష స్పందన





ఎగ్జిబిషన్‌లో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



మోతీనగర్: ప్రతి ఒక్కరూ వారానికి ఒక్కసారైనా చేనేత, ఖాదీ వస్త్రాలు ధరించి చేనేత కార్మికులకు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్స్ మేళా ఎగ్జిబిషన్ చైర్మన్ అక్బర్ ఆలీ, ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్స్ మేళా ఎగ్జిబిషన్‌కు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భగల్పూర్, కాంతా వర్కు, బ్లాక్ ప్రింటెడ్, కలంకారి చీరలతో పాటు గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. మేళాను మోతీనగర్ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్ని డెబిట్, క్రెడిట్ కార్డులపై కొనుగోలు చేసే అవకాశముందన్నారు.

హైటెక్స్‌లో ప్రారంభమైన బీఎన్‌ఐ గోనాట్–2023



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఎన్‌ఐ జాతీయ డైరెక్టర్ హేము సువర్ణ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శనివారం బీఎన్‌ఐ (బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్) గోనాట్ 2023 కార్యక్రమాన్ని బీఎన్‌ఐ జాతీయ డైరెక్టర్ హేము సువర్ణ ప్రారంభించారు. బీఎన్‌ఐ హైదరాబాద్ రీజియన్ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండురోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్‌లో వ్యాపార దిగ్గజాలు, వక్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఐడియల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ ఆయూస్ బన్సాల్, బీఎన్‌ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు ఉత్పత్తులను ప్రారంభించారు. 200 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కామధేను ఎస్టేట్స్ పార్టనర్ స్వాతి, పెర్సమ్ డైరెక్టర్ టి.రాధాకృష్ణ, బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ కోచ్ దీపిక చలసాని, సీలింగ్ క్రూ పార్టనర్ మయాంక్ హారోడియా, శ్రీ అదిత్య వర్షిణీ ఎస్టేట్స్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ‘లేక్ క్లీన్ అప్ డ్రైవ్’



రాయదుర్గం: నిత్యం కంప్యూటర్లు..పుస్తకాలతో కుస్తీలు పట్టే విద్యార్థులు కాస్తా వీకెండ్స్‌లో సేవా దృక్పథాన్ని చాటుతూ ‘లేక్ క్లీన్ అప్ డ్రైవ్’ చేపట్టారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ సెల్ విభాగం, హెచ్‌సీయూ పారిశుద్ధ్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వైట్‌రాక్స్, చెరువు వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళు, వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ భీంసింగ్ మాట్లాడుతూ వైట్‌రాక్స్ వద్ద ఉన్న స్థలాన్ని దుర్వినియోగం చేయడం వల్ల క్యాంపస్ అటవీ ప్రాంతంలోని జంతువులు, పక్షులు గాయపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ శానిటేషన్ విభాగం అధికారులు వెంకటదాస్, జునైద్, సోనీ, నితిన్, అభిలాష్, శంకర్‌నాయక్ బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల బృందం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌తో కలిసి 45 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఇంటిలో సంక్షేమ పథకం లబ్ధిదారులు ఉంటారని, ఇంకా అర్హులైన వారికి అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఒక వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

- విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు ఉండాలి
- రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఏకె ఖాన్

రాయదుర్గం: విద్యార్థులు ఒక లక్ష్యంను ఏర్పరుచుకుని దాని సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఏకెఖాన్ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోయూజీసీ సూచనలపై ఆఫీస్ ఆఫ్ ది డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కొత్త విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ‘దీక్షారంభ్: స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్’ (ఎస్ఐపీ) కార్యక్రమాన్ని నిర్వహించింది.అందులో భాగంగా ‘ ది ఆర్ట్ ఆఫ్ గోల్ సెట్’అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు ఉండాలని సూచించారు. సింబయాసిస్ కళాశాల న్యాయ విభాగాధిపతి డాక్టర్ అనితాసేబుల్ లింగం, చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్కే ఇష్తియాక్ అహ్మద్, అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ జైసీ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐలో 11న జాబ్‌మేళా

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాలో భాగంగా జాబ్‌మేళాతో పాటు అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పలు బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరవుతారని ఐటీఐ ఉత్తీర్ణత చెందిన యువకులు ఉద్యోగాల కోసం మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

మేడ్చల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సెయింట్ క్లారేట్ పాఠశాలలో మండల ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, దాని విలువను కాపాడాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గిరిబాబు, రామేశ్వర్‌రెడ్డి, మంజుల ప్రకాష్, రాధాకృష్ణ, రమేష్, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ కళాశాలలో శనివారం ఇకో క్లబ్, టీమ్ ఆయుధ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ఉన్నతమైన విద్య, ఆరోగ్యకరమైన జీవితం, యువతకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని క్లబ్ అధికారులు శ్రీకాంత్, ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కాళోజీ సేవలు ఎనలేనివి

ఆల్విన్‌కాలనీ: ప్రజా కవిగా, స్వాతంత్ర సమరయోధుడిగా, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు అందించిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాళోజీ నారాయణ రావు 20 ఏళ్లకే దేశం కోసం జైలుకు వెళ్లడానికి వెనుకాడలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాళోజీ జయంతిని తెలంగాణ రాష్ట్ర భాషా దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. తెలంగాణ భాషను, నుడికారాన్ని అతిగా ప్రేమించి తన భాషే తెలంగాణ భాష అని నిక్కచ్చిగా చెప్పిన భాషాభిమాని కాళోజి అన్నారు. ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, ఆ మహనీయుడి జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ గుప్తా, గంధం రాములు, నాయినేని చంద్రకాంత్‌రావు, చాంద్ పాషా, రజినీకాంత్, ప్రభాకర్, శ్రీహరి, రాము, పద్మ దండుగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండప నిర్మాణానికి కర్ర పూజ



కర్ర పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో 16 సంవత్సరాల క్రితం ఈ టీం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం శ్రీవివేకానందనగర్ చౌరస్తాలో వినాయక చవితి మండప నిర్మాణానికి కర్ర పూజ చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏటా వినాయకచవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



దరఖాస్తు అందజేస్తున్న గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నాయకులు గజ్జల యోగానంద్ అన్నారు. శనివారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని, నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. శేరిలింగంపల్లిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కూకట్‌పల్లి అభ్యర్థిగా అవకాశం కల్పించండి



దరఖాస్తు అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2020లో బీజేపీ కార్పొరేటర్‌గా గెలుపొందానని, అప్పటి నుంచి మూసాపేట డివిజన్, నియోజకవర్గంలో సమస్యలపై పోరాటం చేస్తున్నానన్నారు. గత కొన్నేళ్లుగా బీజేపీ క్రియాశీల కార్యకర్తగా, సామాజిక కార్యకర్తగా అంకిత భావంతో నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని అడ్డగుట్టలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తుల కృషి చేస్తానని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీ వాసులు వల్లభనేని సుబ్బారావు, వేణు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, పరమేశ్వర్, మాధవ్, నిరంజన్‌గౌడ్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలి





ఎల్‌ఎల్‌ఐఎఫ్‌టీ ఆవిర్భావ సమావేశంలో పాల్గొన్న అతిథులు

కూకట్‌పల్లి: తెలుగు భాష పరిరక్షణకు అధ్యాపకులు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిని విజయకుమారి అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు భాషానైపుణ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఎల్‌ఎల్‌ఐఎఫ్‌టీ ఆవిర్భావ సమావేశాలు కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారిని విజయ కుమారి, విశిష్ట అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఐనవోలు ఉషాదేవి, ప్రధాన వక్త తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి. గౌరీ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉషాదేవి మాట్లాడుతూ భాషాభ్యాసనంలో ప్రాథమిక సామర్థ్యాలైన శ్రవణం, లేఖనం నేర్పటంలో భాషోపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. లేఖనంలో వ్యాస ప్రకియ ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆచార్య పి. గౌరీ శంకర్ మాట్లాడుతూ తెలుగు భాష అంతరించి పోయే భాషల జాబితాలోకి చేరిందని, అత్యధికులు మాట్లాడే తెలుగు భాష స్థానం 1 నుంచి 4వ స్థానానికి మారిందన్నారు. తెలుగు భాష ఉనికిని కాపాడుకోవాలని అందుకు ఎల్‌ఎల్‌ఐఎఫ్‌టి కార్యక్రమం తోడ్పడుతుందని, ఇందుకు తెలుగు భాషోపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమన్వయకర్త చౌడవరం చంద్రమోహన్ డిఆర్‌జి, జిల్లా సహాయ సమన్వయకర్తలు ఆనంద్, రామారావు, విశ్వపతి, వివిధ మండలాల కన్వీనర్లు జె. రామకృష్ణ రాజు, వి. మాణిక్యం, కృష్ణాగౌడ్, నీరజ, విజయ్ లక్ష్మీ, సరోజ, గుర్నాథం తదితరులు పాల్గొన్నారు.